సాక్షి
సిద్దిపేట
సోమవారం, 1, మే, 2023



జనతీర్థం
న్యాల్‌కల్ మండలం రాఘవాపూర్–హుమ్నాపూర్ శివారులో కుంభమేళా వైభవంగా కొనసాగుతోంది. ఆదివారం భక్తులు మంజీర నదిలో పుణ్యస్నానాలు చేశారు. 8లో..



పోగొట్టుక్ను ఫోన్ అప్పగింత
పోగొట్టుకున్న ఫోన్‌ను బెజ్జంకి ఎస్‌ఐ ప్రవీణ్‌రాజు బాధితుడికి అందించారు. సీఈఐఆర్‌తో టెక్నాలజీతో ఫోన్‌లను రికవరీ చేసినట్లు ఆయన తెలిపారు. 8లో..



రైతును వదలని వరుణుడు
అకాల వర్షాలు రైతును ఆగమాగం చేస్తున్నాయి. ఆదివారం మిరుదొడ్డి, కొండపాక, గజ్వేల్‌లో కురిసిన వడగండ్లకు పంటలు దెబ్బతిన్నాయి. 9లో..

న్యూస్‌రీల్

ముగింపు వేడుకలకు మంత్రి ఎర్రబెల్లి



మాట్లాడుతున్న కొండ లక్ష్మణ్

హుస్నాబాద్: ప్రభుత్వ ఉన్నత పాఠశాల వజ్రోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హాజరవుతారని వజ్రోత్సవ కమిటీ కన్వీనర్ కొండ లక్ష్మణ్ తెలిపారు. వారం రోజుల పాటు పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. మే 1న నిర్వహించే ముగింపు కార్యక్రమంకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యే సతీష్‌కుమార్, కరీంనగర్ ఎంపీ బండిసంజయ్ పాల్గొంటారని, 2వేల మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బండారి మనీల, కమిటీ సభ్యులు పందిల్ల శంకర్, కొత్తపల్లి అశోక్, కేడం లింగమూర్తి, మేకల వీరన్న యాదవ్, అయిలేని మల్లిఖార్జున్ రెడ్డి, గడిపె మల్లేశ్, అయిలేని అనిత, చింతకింది శ్రీనివాస్, బూట్ల రాజమల్లయ్య, వెంకటరమణారెడ్డి, వడ్డెపల్లి వెంకటరమణ, దండి లక్ష్మి, తదితరులు ఉన్నారు.

మెదక్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



దైవ సందేశమిస్తున్న ప్రెసిబెటరీ ఇన్‌చార్జ్ శాంతయ్య

మెదక్ కలెక్టరేట్: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్‌ఐ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి ప్రెసిబెటరీ ఇంచార్జ్ శాంతయ్య దైవ సందేశం అందించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు సిలువ వద్ద కొబ్బరికాయలు కొట్టి, కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చర్చి నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కనీస వసతులు కల్పించారు.

సిద్దిపేటలో పరిశ్రమలు నెలకొల్పుతా..
కేఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ వంశీధర్‌రావు



మాట్లాడుతున్న వంశీధర్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నియోజకవర్గంలోని యువత కోసం త్వరలోనే పరిశ్రమలను నెలకొల్పనున్నట్లు కేఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్‌రావు తెలిపారు. శనివారం రాత్రి సిద్దిపేటలో నిర్వహించిన ఈద్ మిలాప్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వంశీధర్‌రావు మాట్లాడుతూ.. సిద్దిపేట నియోజకవర్గం సీఎం కేసీఆర్‌కు నాటి నుంచి నేటివరకు అండగా నిలుస్తుందన్నారు. త్వరలోనే క్రీడాకారుల కోసం సిద్దిపేటలో క్రికెట్ అకాడమీ నెలకొల్పనున్నట్లు తెలిపారు. అందుకు ఇప్పటికే స్థల సేకరణ చేశామని తెలిపారు. సిద్దిపేట మతసామరస్యానికి ప్రతీక అని, తమ కుటుంబం అన్ని మతాల వారితో మంచి సంబంధాలను కలిగి ఉందన్నారు. సిద్దిపేట అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వివిధ మతాల పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లేక అంధకారం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలో ఆదివారం ఈదురుగాలులు, వడగండ్ల వర్షం కురియడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. విద్యుత్‌శాఖ అధికారులు సాయంత్ర 4గంటల నుంచి సరఫరాను నిలిపివేయడంతో పట్టణం అంతా అంధకారం ఏర్పడింది. దీంతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పొంచి ఉన్న ముప్పు

- పక్క రాష్ట్రాల నుంచి బీటీ–3 పత్తి!
- త్వరలో ప్రారంభం కానున్న సీజన్
- కేసులు నమోదవుతున్నా.. మారని తీరు



గజ్వేల్ ప్రాంతంలో అధికారులు పట్టుకున్న బీటీ విత్తనాలు (ఫైల్)

గజ్వేల్: ప్రభుత్వ అనుమతి లేని బీటీ–3 పత్తి విత్తనం ముప్పు ఈసారి కూడా పొంచి ఉంది. విత్తనాల విక్రయ సీజన్‌కు కొద్ది రోజులే ఉండటంతో అక్రమార్కులు చెలరేగిపోయే అవకాశముంది. ఏటా కేసులు నమోదవుతున్నా తీరు మారటం లేదు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా దిగుమతి చేసుకొని అధిక ధరలకు రైతులకు అంటగడుతున్నారు.

- వ్యాపారుల నిర్వాకంతో ఆరేళ్ల క్రితం వరకు ప్రతీ వానాకాలం సీజన్‌లో బీటీ పత్తి విత్తనాల బ్లాక్ మార్కెట్ రైతులకు తలనొప్పిగా ఉండేది.
- గతంలో రూ.930కి విక్రయించాల్సిన విత్తన ప్యాకెట్‌లను రూ.3 వేలకుపైగా విక్రయించి లక్షలు దండుకున్నారు.
- శాస్త్రీయంగా అన్నిరకాల విత్తనాలు ఒకే రకమైన ఫలితాలనిస్తుండగా వ్యాపారులు మాత్రం వ్యూహాత్మంగా కొన్ని రకాలను ఎంపిక చేసి అధిక దిగుబడినిస్తాయంటూ రైతులకు అంటగడుతున్నారు.

కొత్త తరహా మోసం

- బీటీ పత్తి విత్తనాల్లో అక్రమార్కులకు పాల్పడి గతంలో లక్షలు గడించిన వ్యాపారులు, దళారులు ఇదే రుచి మరిగారు.
- అనుమతిలేని 'బీటీ–3' విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు.
- ఈ విత్తనాలను వేస్తే 'బీటీ–2' కంటే తెగుళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడమే కాకుండా కలుపు ఉండదని నమ్మబలుకుతున్నారు.
- నిజానికి బీటీ–2 విత్తన ప్యాకెట్ ధర రూ.853లు. కానీ అనుమతిలేని బీటీ–3 విత్తనాలను రెట్టింపు ధరకు విక్రయిస్తున్నారు.
- గతేడాది జిల్లాలో 1.50 లక్షల పైచిలుకు ఎకరాల్లో పత్తి సాగులోకి వస్తే ఇందులో 20 శాతానికిపైగా 'బీటీ–3' వేసినట్లు అంచనా.
- ఈ విత్తనం వేసిన రైతుల అంచనాలు తలకిందులయ్యాయి. ఎడతెరిపిలేని వర్షాలు, ముసురు పరిస్థితుల్లోనూ 'బీటీ–2' విత్తనం రైతులకు మోస్తరు దిగుబడులను ఇచ్చింది.
- అందుకుభిన్నంగా 'బీటీ–3' విత్తనం మొక్కలు ఎదగకపోవడమే కాకుండా కాయలురాలేదు. కలుపు పేరుకుపోయి ఎన్ని మందులు పిచికారీ చేసినా అదుపులోకి రాక రైతులు పంటలను వదిలేయాల్సిన పరిస్థితి నెలకొన్న ఘటనలు ఉన్నాయి.

ఇతర రాష్ట్రాల నుంచి మార్కెట్లోకి

- కొద్ది రోజుల తర్వాత బీటీ పత్తి విత్తనాల విక్రయాల సీజన్ ప్రారంభమయ్యే అవకాశముంది.
- గతంలో మహారాష్ట్రలోని ఔరంగాబాద్, జాల్నా ప్రాంతాలతో పాటు గుజరాత్‌లోని వివిధ పట్టణాల నుంచి ఈ విత్తనాలను తీసుకువచ్చేవారు.
- సిద్దిపేట జిల్లానే కాకుండా మెదక్, యాదాద్రి, జనగామ, మేడ్చల్ జిల్లాలకు విత్తన క్రయవిక్రయాల్లో గజ్వేల్ ప్రాంతం హబ్‌గా మారింది.
- ఎప్పటిలాగే ఈసారి కూడా సీజన్‌కు ముందే అక్రమార్కులు తెరతీసినట్లు తెలుస్తోంది.

మల్లన్న ఆలయంలో భక్తుల రద్దీ



బోనాలతో వస్తున్న భక్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయంలో ఆదివారం భక్తులు భారీగా తరలి రావడంతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి. సుమారు 15 వేల మంది దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. శనివారం సాయంత్రం నుంచి క్షేత్రానికి చేరుకున్న భక్తులు ఆదివారం ఉదయం కేశఖండన చేసుకొని పుష్కరణిలో స్నానమాచరించారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని, అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేకపూజలు, ఒడిబియ్యం, గంగిరేణిచెట్టు వద్ద ముడుపులు కట్టి, మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది స్వామివారి నిత్యకల్యాణంలో పాల్గొన్నారు. కొండపైన రేణుక ఎల్లమ్మను దర్శించుకొని బోనం



రాజగోపురం ఎదుట భక్తుల సందడి

చెల్లించారు. ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, ఆలయ ఈఓ బాలాజీ శర్మ, ఏఈఓలు అంజయ్య, శ్రీనివాస్‌లు పర్యవేక్షించారు.



మంత్రి హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావును ఆదివారం జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన మంత్రి హరీశ్ రావును ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా కన్వీనర్ అరిగె అశోక్, మాత్‌పల్లి సర్పంచ్ మహిపాల్ పాల్గొన్నారు. సీఎం కేసీఆర్‌ను ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్, టీఎస్‌ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.
– గజ్వేల్

నృసింహుని సన్నిధిలో సామూహిక వ్రతాలు



మండపంలో పూజలు చేస్తున్న భక్తులు

కిటకిటలాడిన నాచగిరి క్షేత్రం

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధ నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సామూహిక సత్యనారాయణ వ్రతాలు, నృసింహుని నిజాభిషేక పూజలు, కల్యాణాలతో ఆలయ ప్రాంగంణం అలరారింది. హైదరాబాద్, సికిందరాబాద్, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులు హరిద్ర నదిలో పుణ్యస్నానాలాచరించారు. దంపతులు భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా 25 అభిషేకాలు, 17 సత్యనారాయణ వ్రతాలు, 9 కల్యాణాలు జరిగాయని ఆలయ సీనియర్



భక్తులతో కిక్కిరిసిన క్యూలైన్

అసిస్టెంట్ సుధాకర్ తెలిపారు. భక్తుల తాకిడికి క్యూలైన్లు రద్దీగా మారగా, ఆలయ సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకున్నారు. శ్రీవిద్యాసరస్వతి క్షేత్రంతో భక్తులు అమ్మవారి కుంకుమార్చన జరిపించారు. ఉప ఆలయాలలో దేవతామూర్తులను దర్శించుకున్నారు.

వనదుర్గకు జన హారతి



భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

పాపన్నపేట(మెదక్): వనదుర్గకు భక్తులు జన హారతి పట్టారు. ఆదివారం తెల్లవారు జామునే పూజారులు దుర్గమ్మ తల్లిని ఎరుపు రంగు పట్టు వస్త్రాలతో అలంకరించి అర్చనతో పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు మంజీర నదిలో స్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. డప్పు చప్పుళ్లతో బోనాలు సమర్పించి.. ఒడి బియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా పాలకవర్గ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ సార శ్రీనివాస్, పోలీసులు చర్యలు తీసుకున్నారు.

కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

చేర్యాల(సిద్దిపేట): పట్టణంలోని మార్కెట్ యార్డులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. ఆదివారం మార్కెట్‌యార్డు ఆవరణలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతులకు మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, మార్కెట్ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, మంగోలు చంటి, రైతుబంధు సమితి మండల కో–ఆర్డినేటర్ తాడెం రంజిత, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రాజేశం పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

రైతులకు పరిహారం చెల్లించాలి

- కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేశ్‌రెడ్డి

పాపన్నపేట(మెదక్): అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం డీసీసీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోవింద్‌తో కలిసి మండల పరిధిలోని ఎల్లాపూర్, పొడిచన్‌పల్లి, పొడిచన్‌పల్లి తండా, శానాయపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న పంటలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వడగండ్లతో చేతికొచ్చిన పంట చేజారి పోయిందన్నారు. వరి పంట నిలువునా రాలి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ.. కొనుగోళ్ల ప్రక్రియ ముందుకు సాగడం లేదన్నారు.




పొడిచన్‌పల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ బృందం

పంట నష్టపోయిన రైతుకు ఎకరానికి రూ. 10 వేలు చెల్లిస్తానని చెప్పిన సీఎం కేసీఆర్ ఇంత వరకు ఇవ్వలేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో క్వింటాల్‌కు 5 కిలోల తరుగు తీస్తున్నారని వాపోయారు. ధరణి రైతుల పాలిట శాపంగా మారిందని విమర్శించారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నిఠలాక్షప్ప, ఎస్టీ సెల్ జిల్లా అధక్షుడు ప్రేం రాథోడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిధులు రాక.. ఆదాయం లేక

అప్పులు చేస్తున్న సర్పంచ్‌లు

- భారమవుతున్న పంచాయతీల నిర్వహణ
- చేసిన పనులకు అందని బిల్లులు



ఈ చిత్రంలో ఉన్న వ్యక్తి బత్తుల మల్లయ్య. మాలపల్లె సర్పంచ్. గ్రామంలో మంచినీటి సరఫరా, విద్యుత్ మోటార్ల రిపేరు, వీధి దీపాలు, పల్లె ప్రకృతి వనానికి నీరందరించేందుకు పైప్‌ల కోసం రూ.1.10లక్షలు అప్పుచేశాడు. 8 నెలలుగా పంచాయతీలకు పైసా రాకపోవడంతో వడ్లు అమ్మి రూ.80వేలు అప్పు చెల్లించాడు. మరో రూ.30వేలు చెల్లించాలంటూ షావుకారి ఫోన్ చేయడంతో ఏం చేయాలో తెలియడంలేదని ఆందోళన చెందుతున్నాడు.

హుస్నాబాద్‌రూరల్: ఇది ఒక్క మల్లయ్యకే కాదు.. జిల్లాలోని చాలా గ్రామాల్లో సర్పంచ్‌ల పరిస్థితి. ప్రభుత్వం జీపీలకు అందించే నిధులను ఫ్రీజ్ చేయడంతో నిర్వహణ కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. జిల్లాలోని 499 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు నిధులు లేక, బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారు. హుస్నాబాద్ మండలంలో 17 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు విషయాన్ని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నిస్తే అందుబాటులో ఉండడంలేదని వాపోతున్నారు. దీంతో విసిగిపోయిన సర్పంచ్‌లు బిల్లులు మంజూరు చేయకుండే మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని ఇటీవల మండల సభలో ఎంపీపీ మానస సమక్షంలో ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు.



పందిల్లలో పంచాయతీ ట్రాక్టర్‌తో చెత్త సేకరిస్తున్న దృశ్యం

కొత్త తరహా మోసం..

- కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు నేరుగా నిధులు ఇస్తామని చెప్పడంతో అధికారులు ప్రత్యేక బ్యాంక్ ఖాతాలు తెరిచారు.
- ఎనిమిది నెలలుగా రాష్ట ప్రభుత్వం నుంచి పంచాయతీలకు నిధులు విడుదల కాలేదు.
- దీంతో గ్రామాల్లో పారిశుధ్యం, పల్లె ప్రగతి, సిబ్బంది వేతనాలు చెల్లించేందుకు నిధులు లేక సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నారు.
- విధిలేక తప్పనిపరిస్థితుల్లో అప్పులు తెచ్చి సిబ్బందికి వేతనాలు, అత్యవసర పనులను చేయిస్తున్నారు.
- పంచాయతీలకు వచ్చే ఆదాయం కనీసం ట్రాక్టర్ కిస్తీలు, కరెంట్ బిల్లులు కట్టేందుకు కూడా సరిపోవడంలేదని వాపోతున్నారు.
- క్రీడా ప్రాగంణాల నిర్మాణాల బిల్లులు రాక, చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక నానా అవస్థలు పడుతున్నామని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.1.20 లక్షలు అప్పుచేశా



ఇంటింటికి చెత్త సేకరణ చేసేందుకు ఉపయోగించే ట్రాక్టర్‌కు డీజిల్ ఖర్చులకు రూ.1.20లక్షలు అప్పుచేసి చెల్లించా. పంచాయతీలకు నిధులు రాక, ఆదాయం లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. కార్మికులకు వేతనాలు అందించలేని పరిస్థితి.
– తోడేటి రమేశ్, సర్పంచ్, పందిల్ల

ఉన్నతాధికారులకు నివేదించాం



ఆరు నెలలుగా ఎస్‌ఎఫ్‌సీ నిధులు రాలేదు. నెల కిందట ఒక దఫా నిధులు వచ్చినా.. అవి ఫ్రీజింగ్‌లో పెట్టారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో సర్పంచులు మాపై ఒత్తిడి తెస్తున్నారు. విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం.
– రాజీవ్‌కుమార్, డీఎల్‌పీఓ, హుస్నాబాద్

క్లుప్తంగా

కడవేర్గు చెరువు మట్టి పరిశీలన



చెరువును పరిశీలిస్తున్న ఎంపీపీ కరుణాకర్

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని కడవేర్గు చెరువులో ఎఫ్‌టీఎల్ పరిధిలో కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు మట్టిని నింపారు. ఈ విషయాన్ని గ్రామస్తులు ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్ దృష్టికి తీసుకెళ్లగా ఆదివారం ఆయన చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ..పట్టాభూమి ఎఫ్‌టీఎల్‌లో మట్టి పోయడంతో చెరువుకు ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. చెరువు శిఖం 100 ఎకరాల వరకూ ఉంటుందని ఆయన తెలిపారు. ప్రతి సంవత్సరం గోదావరి జలాలతో చెరువును నింపుతున్నామన్నారు. దీంతో భూగర్భజలాలు పెరిగి రైతులకు మేలు కలుగుతుందన్నారు. ఈ విషయమై స్థానిక తహసీల్దార్, నీటి పారుదల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చానని, సంబంధిత అధికారులు సోమవారం క్షేత్రస్థాయిలో సందర్శించి చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు ఆయన తెలిపారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కొండపాక(గజ్వేల్): భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో వ్యక్తి ఉరివేసుకొని మృతి చెందాడు. కుకునూర్‌పల్లి ఎస్ఐ పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం..కొండపాక మండలం వెలికట్ట గ్రామానికి చెందిన అమ్ముల కనకయ్యకు 40ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కుటుంబ కలహాలతో భార్య పుట్టింటికి వెళ్లిందని తెలిపారు. ఈ క్రమంలో కనకయ్య కూలీ పనులు చేసుకుంటూ కాలం గడిపేవాడన్నారు. శనివారం రాత్రి మనస్తాపానికి గురై ఇంట్లో ఉరివేసుకొని మృతి చెందాడన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ పుష్పరాజ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నీటిలో మునిగి వ్యక్తి మృతి



రాజాసాబ్ (ఫైల్)

రామాయంపేట(మెదక్): రామాయంపేట మండలం కాట్రియాల గ్రామంలో చేపలు పట్టడానికి వెళ్లిన వ్యక్తి కాళ్లకు వల చుట్టుకొని నీటిలో మునిగి మృతి చెందినట్లు ఎస్ఐ రంజిత్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి..గ్రామానికి చెందిన మద్ది రాజాసాబ్(52) చేపలు పట్ట డానికని పెద్ద చెరువువద్దకు వెళ్లాడు. చేపల కోసం వల వేశాడు. ప్రమాదవశాత్తు కాళ్లకు వల చుట్టుకొని నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారని పేర్కొన్నారు.

జనతీర్థం

- వైభవోపేతంగా కుంభమేళా
- తరలి వస్తున్న భక్తులు
- సాధువు, సంతుల అబ్బుర పరిచే విన్యాసాలు



పుణ్య స్నానం చేస్తున్న నాగ సాధువులు

న్యాల్‌కల్(జహీరాబాద్): రాఘవాపూర్–హుమ్నాపూర్ గ్రామాల శివారులో రెండో భాసరగా విరాజిల్లుతున్న పంచవటి క్షేత్రంలో కుంభమేళా వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. మంజీర నదిలో పుణ్యస్నానాలు చేశారు. జిల్లాలోని నలుమూలల నుంచే కాకుండా అంతర్ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. పంచవటి క్షేత్రాన్ని దర్శించుకుంటున్నారు. ఆదివారం ఎండ తీవ్రత తక్కువగా ఉండడం, సెలవు దినం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. మంజీర నదిలో స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచవటి క్షేత్రం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు ఆశ్రమ పీఠాధిపతులు, సాధుసంతులు, స్వామిజీలు భక్తులకు కుంభమేళ ప్రాముఖ్యత, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలపై ప్రసంగించారు. సమీపంలో గల గంగాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దైవదర్శనం చేసుకున్నారు. ఆలయం ప్రాంగణంలో యజ్ఞాలు, హోమాలు నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా కొనసాగుతున్నాయి. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సాధు, సంతులను దర్శించుకుంటున్నారు. వారి అలంకరణ, వేశాధారణ, నృత్యాలు, అబ్బుర పరిచే విన్యాసాలను చూసి భక్తులు ఆశ్చర్యానికి లోనవుతున్నారు. సాయంత్రం సాధువులు పల్లకిసేవతో నృత్యాలు చేస్తూ మంజీర నది వరకూ తరలి పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు.

ఆకట్టుకున్న భరతనాట్యం

కర్ణాటక ప్రాంతానికి చెందిన భరత నాట్యమండలి ప్రదర్శించిన నృత్యాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చిన్నారులు చేసిన నృత్యాలు చూపరులను అబ్బురపరచాయి.



పూజలు చేస్తున్న భక్తులు



భజన చేస్తున్న చిన్నారులు

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అప్పగింత



ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ మహేశ్



బెజ్జంకి(సిద్దిపేట): అందజేస్తున్న ఎస్ఐ ప్రవీణ్‌రాజు

హుస్నాబాద్: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ సీఈఐఆర్‌తో (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్) బాధితునికి అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి..హుస్నాబాద్ పట్టణానికి చెందిన పద్మ తన స్కూటీపై వెళుతుండగా మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన సీఈఐఆర్ గురించి తెలుసుకొని ఫోన్‌కు సంబంధించిన వివరాలను ఎంటర్ చేసి బ్లాక్ చేశారన్నారు. వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. అనంతరం ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి వివరాలను సేకరించి తిరిగి ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వెంటనే సదరు మహిళ బంధువునకు అప్పగించినట్లు ఎస్ఐ మహేశ్ వెల్లడించారు.

బెజ్జంకి(సిద్దిపేట): పోగొట్టుకున్న ఫోన్‌ను బెజ్జంకి పోలీస్ స్టేషన్‌లో బాధితునికి అందజేశారు. బెజ్జంకి ఎస్ఐ ప్రవీణ్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 27న మండలంలో ఇద్దరి ఫోన్లు పోయినట్లు తెలిపారు. వారు వెబ్‌సైట్‌లో చేసిన ఫిర్యాదు ఆధారంగా సీఈఐఆర్‌తో ఆ ఫోన్‌లను రికవరీ చేసుకుని ఆదివారం బాధితులకు అందజేసిన్నట్లు తెలిపారు. వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయలేని వారు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయొచ్చని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ మిర్జాయూనస్, బేగ్, పీసీలు శ్రీనివాస్, అశోక్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానితులు ఉంటే సమాచారమివ్వాలి

జీడిపల్లిలో కార్డన్‌సెర్చ్‌లో సీఐ శ్రీధర్

మనోహరాబాద్(తూప్రాన్): ఎవరైనా అనుమానితులుంటే తమకు సమాచారమివ్వాలని తూప్రాన్ సీఐ శ్రీధర్ పేర్కొన్నారు. ఆదివారం మనోహరాబాద్ మండలంలోని జీడిపల్లి గ్రామంలో వేకువజామున సీఐ కార్డన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైనా ధ్రువీకరణ పత్రాలు లేని 11బైక్‌లు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. గ్రామంలో శాంతి భద్రతలకు ఆటంకం కలిగించొద్దని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ సూచించారు. ఇండ్లను అద్దెకు ఇచ్చేటప్పుడు పూర్తి వివరాలు తెలుసుకొని ఇవ్వాలన్నారు. ఎవరైనా అనుమానితులుంటే పోలీస్‌స్టేషన్లో సమాచారమివ్వాలన్నారు. ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, రోడ్డుపై ప్రయాణించేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సందీప్‌రెడ్డి, తూప్రాన్, వెల్దుర్తి, శివ్వంపేట్ ఎస్ఐలు సంతోష్‌కుమార్, మహేందర్‌గౌడ్, రవికాంత్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని అశోక్‌నగర్, ఇక్రిశాట్ వద్ద జాతీయరహదారిపై శనివారం రాత్రి పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. 2కార్లు, 8ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సంజయ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. కొంత మంది ద్విచక్ర వాహనలకు, కార్లకు నెంబర్ ప్లేట్‌లను తీసివేసి తిరుగుతున్నారని వివరించారు. నెంబర్‌ప్లేట్‌లు లేకుండా తిరిగే వాహనదారులపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన



వీరబ్రహ్మేంద్రస్వామి ప్రతిమ



విద్యుత్‌నగర్ కాలనీలో నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని జీపీ కాలనీలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 330 అరాధన దినోత్సవాన్ని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి అలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దయానంద్‌చారి, ఉపాధ్యక్షుడు రాములు, సభ్యులు శ్రీధర్‌చారి, చంద్రశేఖర్ నరేష్, వెంకన్న, యాదగిరి, శివరాజ్ విక్రమ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో ఆదివారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాన్ని విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం నాయకులు కృష్ణమూర్తిచారి, నారాయణ, రవిచారి, శివకుమార్‌చారి, వీరేశలింగం, మధు పాల్గొన్నారు.

వైభవంగా బీరప్పస్వామి బోనాలు

రాయికోడ్(అందోల్): మండల పరిధిలోని శంషోద్దీన్‌పూర్ గ్రామంలోని బీరప్పస్వామి జాతరలో భాగంగా భక్తులు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయానికి చేరుకుని బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా కళాకారుల విన్యాసాలు, అకట్టుకున్నాయి.

ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేటలోని రాజేందర్‌నగర్ కాలనీలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయంలో గణపతి, నవగ్రహ విగ్రహాలు, నంది, శివపార్వతుల, ఆంజనేయస్వామి యంత్ర ప్రతిష్ఠ, విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం నిర్వహించారు. అనంతరం శ్రీ మహా సీతారామచంద్ర స్వాముల కల్యాణం నిర్వహించారు. శ్రీ సితారాముల కల్యాణం సిద్దిపేట త్రీటౌన్ సీఐ భాను ప్రకాష్, ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, టూటౌన్ సీఐ రవికుమార్‌లు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వాగత తోరణాన్ని ప్రారంభిస్తున్న అవదూత్‌గిరి మహరాజ్

నారాయణఖేడ్: మండలంలోని లింగాపూర్‌లో వేంకటేశ్వరస్వామి, పద్మావతి, భూదేవిల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ కూడలిలో సాంబయ్య సునంద జ్ఞాపకార్థం ఆమె భర్త నర్సింహులు, కుమారుడు ప్రభాకర్ నిర్మింపచేసిన స్వాగత తోరణాన్ని అవదూత్‌గిరి మహరాజ్ ప్రారంభించారు. సర్పంచ్ సతీష్, జట్ల భాస్కర్, శివ్‌లింగ్‌పటేల్ పాల్గొన్నారు.

దొరికిన పర్స్ పోలీసులకు అందజేత

దుబ్బాక: రోడ్డుపై పడిపోయిన పర్స్‌ను పోలీసులకు అప్పగించి దొంతగుని రమేశ్ గౌడ్ మంజుల దంపతులు తమ నిజాయితీని చాటుకున్నారు. ఈ సంఘటన దుబ్బాక పట్టణంలోని శనివారం అంగట్లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..దుబ్బాకకు చెందిన ఆస మౌనిక అంగట్లో కురగాయలు తీసుకోవడానికి వచ్చి తన పర్స్‌ను పోగుట్టుకుంది. అటుగా వెళుతున్న రమేశ్ గౌడ్ మంజుల దంపతులకు ఇది దొరికింది. దీన్ని తీసుకొని వారు దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. పర్స్‌లో ఉన్న వివరాలతో బాధితులను పిలిపించి ఆదివారం అప్పగించారు. దొరికిన పర్స్‌ను పోలీసులకు అప్పగించినందుకు రమేష్ గౌడ్ మంజుల దంపతులను ఎస్ఐ మహేందర్‌తో పాటు పలువురు అభినందించారు.



పర్స్‌ను అందజేస్తున్న ఎస్ఐ మహేందర్

తాళం వేసిన ఇంట్లో చోరీ

మెదక్ మున్సిపాలిటీ: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన మెదక్ పట్టణంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..మెదక్ పట్టణంలోని నల్లపోచమ్మ ఆలయం వెనకాల నివాసం ఉంటున్న ఉపాధ్యాయుడు దేవ్లా ఇంటికి తాళం వేసి కుటుంబీకులతో బంధువుల ఫంక్షన్‌కి వెళ్లాడు. ఆదివారం వచ్చి చూసేసరికి ఇంటి తాళం తెరిచి ఉంది. దీంతో వారు లోపలికి వెళ్లి చూసే సరికి బంగారం, ల్యాప్‌ట్యాప్ చోరీకి గురైనట్లు దేవ్లా తెలిపారు. వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. సీఐ సంజయ్ డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంతో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నర్సాపూర్‌రూరల్: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదివారం నర్సాపూర్ ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం..నర్సాపూర్ మండలం తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల కృష్ణ(40) అప్పుల బాధతో శనివారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించాలని సూచించారు. వెంటనే కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడు ఇటీవల అప్పుచేసి కూతురు పెళ్లి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. అప్పుల బాధ భరించలేక కృష్ణ ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు.



కృష్ణ (ఫైల్)

మాచదేవుడి విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో ప్రజాప్రతినిధులు, నాయకులు

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని ఎల్గోయి గ్రామంలో మడివాళ మాచదేవుడి విగ్రహ ఆవిష్కరణను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాచదేవుడికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతి 108 వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్, రంజోల్ ఆశ్రమ పీఠాధిపతి రాచయ్యస్వామి, టీపీసీసీ నాయకుడు నరోత్తం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్, జెడ్పీటీసీ వినిలనరేష్, సర్పంచ్ ఓంప్రకాశ్‌పాటిల్, జహీరాబాద్ ఎంపీపీ గిరిధర్‌రెడ్డి, ఎంపీటీసీలు సంగీతగుండప్ప, శంకర్‌పాటిల్, జహీరాబాద్ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు ముల్తాని, భాస్కర్‌రెడ్డి, కండెం నర్సింలు, రజక తాలుకా అధ్యక్షుడు అల్గోల్ బక్కన్న, మండల అధ్యక్షుడు శ్రీశైలం, సభ్యులు పాల్గొన్నారు.

భూలక్ష్మమ్మ జాతర ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నారాయణఖేడ్: మండలంలోని తుర్కాపల్లిలో ఆదివారం భూలక్ష్మమ్మ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బండ్ల ప్రదర్శన నిర్వహించారు. బండ్ల ప్రదర్శనలో ఎల్గోయి గ్రామానికి చెందిన భక్తుల బండ్లు మొదటి ప్రాధాన్యతలో నిలువగా కామారెడ్డి జిల్లా ధర్మారానికి చెందిన భక్తుల బండ్లు రెండవ ప్రాధాన్యతలో నిలిచాయి. రాత్రి బోనాల ఊరేగింపు, నాటక ప్రదర్శన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ స్రవంతిపరమేశ్వర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పాడిగేదెలు చోరీ



ఫిర్యాదు చేస్తున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గూడూర్ గ్రామంలో శనివారం అర్ధరాత్రి పాడిగేదెలు చోరీకి గురయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి..గ్రామానికి చెందిన బోయిని ఐలయ్యకు చెందిన పాడిగేదెలను రోజువారిగానే తనపొలం వద్ద కొట్టంలో కట్టేశాడు. ఆదివారం వెళ్లి చూసే సరికి మూడు పాడి గేదెలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. పలుచోట్ల, సమీప ప్రాంతంలో వెతికినా వాటి ఆచూకీ లభించలేదు. గ్రామానికి చెందిన ఓ వ్యాపారి పాడిగేదెలను చోరీ చేసి ఆటోలో జహీరాబాద్‌లోని పశువధశాలకు తరలించినట్లు బాధిత రైతు పోలీసులకు చేసిన ఫిర్యాదులో ఆరోపించాడు. గత కొంత కాలంగా పలువురు రైతులకు సంబంధించిన పశువులు చోరీకి గురవుతున్నట్లు వారు పేర్కొన్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. రైతుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రవికాంత్‌రావ్ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

వెల్దుర్తి(తూప్రాన్): గోనెమైసమ్మ జాతర ఉత్సవాల్లో అపశృతి చోటుచేసుకుంది. ఉత్సవాల చివరిరోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..తూప్రాన్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన రాజు(30) తల్లి దండ్రులు చిన్నప్పుడే చనిపోవడంతో యేడాది క్రితం వెల్దుర్తి పట్టణంలోని అంగడిపేట కాలనీకి చెందిన నీరుడి నెల్లూర్, నర్సమ్మల కూతురును వివాహం చేసుకొని ఇల్లరికం వచ్చాడు. జాతరలో పూజారిగా పనిచేస్తున్న రాజు తన భార్యను ఇంటికి తీసుకెళ్లడానికి బైక్‌పై వెళుతున్నాడు. కమాన్ నుంచి ఆలయం వరకూ ట్రాఫిక్ జామ్ కారణంగా వేరే రూట్‌నుంచి వెళుతున్నక్రమంలో ఎదురుగా వచ్చిన మరో బైక్ బలంగా ఢీ కొట్టింది. దీంతో రాజు రోడ్డు కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అధ్వానంగా అమీన్‌పూర్ రోడ్డు

- రోడ్డంతా గుంతలమయం
- 75 కాలనీల ప్రజలు చందానగర్‌కు రాకపోకలు
- అభివృద్ధికి నిధులు కేటాయింపు
- ప్రారంభంకాని పనులు



గుంతలుగా తయారైన ప్రధాన రోడ్డు

పటాన్‌చెరు: 150 కాలనీలు, లక్షకు పైగా జనాభా ఉన్న అమీన్‌పూర్ ప్రధాన రోడ్డు అధ్వానంగా ఉంది. కొత్త పాలకవర్గం వచ్చినప్పటి నుంచి ఆ రోడ్డు అభివృద్ధి చేస్తామని చెబుతున్నారు తప్ప బాగు చేయాలేదు. పట్టణంలోని సగభాగం అంటే దాదాపు 75 కాలనీల ప్రజలు ఆ రోడ్డు మీదుగా చందానగర్‌కు రాకపోకలు సాగిస్తారు. అమీన్‌పూర్ నుంచి చందానగర్ వెళ్లే ఆ రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది. అప్పుడప్పుడు పాలకవర్గం ఆ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయిస్తున్నారు. ఆ రోడ్డు మీదుగానే బొల్లారం పారిశ్రామికవాడ, సుల్తాన్‌పూర్ మెడికల్ డివైజెస్ పార్కు వైపు ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఆ రోడ్డు అభివృద్ధికి నిధులు కేటాయించినట్లు గతంలో అధికారులు వెల్లడించారు. కారణాలేమైనా ఆ రోడ్డు నేటికీ బాగుపడలేదు. బందం కొమ్ము వద్ద కల్వర్టు వెడల్పు చేసినప్పటికీ ఇప్పుడున్న వాహనాల రాకపోకలకు అదేమాత్రం సరిపోదు. సీఎం కేసీఆర్ జిల్లాలోని అన్ని పట్టణాలకు కేటాయించిన నిధుల్లో అమీన్‌పూర్‌కు రూ.25 కోట్లు విడుదలయ్యాయి. ఆ నిధుల్లో రూ.7 కోట్లతో రోడ్డు అభివృద్ధికి కేటాయించారు. ఆ రోడ్డుపై ఉన్న విద్యుత్‌స్తంభాలను పక్కకు జరిపేందుకు విద్యుత్ శాఖ రూ.5 కోట్లు ఇవ్వాలని మున్సిపాల్టీని కోరింది. రోడ్డు వేసేందుకు కేటాయించిన రూ.7 కోట్లలో రూ.5 కోట్లు విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు ఖర్చు కానుండటంతో రోడ్డు పనులు నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం

అమీన్‌పూర్ ప్రధాన రోడ్డు అభివృద్ధి పనులకు రూ.7 కోట్లు కేటాయించాం. అయితే విద్యుత్ శాఖ వీధి దీపాలను మార్చి కొత్తవి వేసేందుకు రూ.5 కోట్లు ఇవ్వాలని కోరింది. ఆ సమస్య పరిష్కారం కోసం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సహకారం కోరాం. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాను. ఆ నిధులను ప్రభుత్వమే ఇవ్వనుంది. త్వరలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తాం. వర్షాకాలం నాటికి పనులు పూర్తవుతాయనుకుంటున్నాం.



– పాండురంగారెడ్డి చైర్మన్, అమీన్‌పూర్